క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



గానుగుబండలో ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి

తుంగతుర్తి : మండల పరిధిలోని గానుగుబండ గ్రామానికి చెందిన కట్ల వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి మంగళవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, క్వింటా బియ్యం, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ కట్ల చంద్రయ్య, కట్ల మల్లయ్య, పంజాల ప్రవీణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని టేకుమట్ల, కాసరబాద గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన డంపులను పోలీసు శాఖ సహకారంతో మంగళవారం రెవెన్యూ శాఖ అధికారులు సీజ్ చేశారు. టేకుమట్ల గ్రామంలో సుమారు 900 ట్రిప్పుల ఇసుక, కాసరబాద గ్రామంలో 300 ట్రిప్పుల ఇసుక డంపులను సీజ్ చేసినట్లు ఆర్ఐ తెలిపారు. సీజ్ చేసిన డంపులను పంచాయతీ కార్యదర్శులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆర్ఐ రవి, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరుకావాలి

అర్వపల్లి : ప్రజాపాలన గ్రామ సభల నిర్వహణపై బుధవారం తిరుమలగిరిలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కతురోజు ఉమేష్ మంగళవారం తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగారం : విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని స్థానిక విద్యుత్‌శాఖ ఏఈఈ మహేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగారం, ఫణిగిరి గ్రామాల్లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నాగారం, డి.కొత్తపల్లి, వర్ధమానుకోట, మాచిరెడ్డిపల్లి, నర్సింహులగూడెం, ఫణిగిరి, మామిడిపల్లి, ఈటూరు, అనంతరం, మాలిపురం గ్రామాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా మహేష్



అర్వపల్లి : యువజన కాంగ్రెస్ అర్వపల్లి టౌన్ ఉపాధ్యక్షుడిగా కొమారి మహేష్‌ముదిరాజ్ నియమితులయ్యారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్ మంగళవారం మహేష్‌ను నియమించారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన కట్టెల కృష్ణ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. దీంతో అతడి మృతదేహాన్ని బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్ సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మేకల రాంబాబు, మామిడి శ్రీను, కుంభం సతీష్, సంపత్, గణేష్, శ్రీకాంత్, విక్రం తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన సభలను విజయవంతం చేయాలి

అర్వపల్లి : మండలంలో ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు జరిగే ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన నిర్వహణకు రెండు టీంలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తనతో పాటు ఎంపీడీఓ సందీప్ ఆధ్వర్యంలో రెండు టీంలు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల తగు ఏర్పాట్లు చేయాలని, ప్రజాపాలనపై గ్రామాల్లో దండోరా వేయించాలని కోరారు.

అస్తవ్యస్తంగా ప్రధాన రహదారి

- తుంగతుర్తి నుంచి వెంపటి, రావులపల్లికి వెళ్లే రహదారిపై అడుగడుగునా గుంతలు
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



వెంపటి సమీపంలో అధ్వానంగా ఉన్న రహదారి



గుంతలమయంగా మారిన రహదారి

తుంగతుర్తి : తుంగతుర్తి నుంచి వెంపటి, రావులపల్లికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. అడుగడుగునా గుంతలు ఉండటంతో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుంగతుర్తి నుంచి వెంపటికి మూడు కిలోమీటర్ల దూరం, వెంపటి నుంచి రావులపల్లికి 5 కిలోమీటర్ల దూరంలో రోడ్డు పూర్తిగా ధ్వంసమై పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. తుంగతుర్తి, వెంపటి, రావులపల్లి మీదుగా తొర్రూరు, వరంగల్‌కు ప్రజలు అధికంగా వెళ్తుంటారు. అలాగే మానాపురం, ఏనెకుంటతండా, రావులపల్లి, వెంపటి, తుంగతుర్తి మీదుగా ప్రజలు నిత్యం సూర్యాపేట, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. వాస్తవానికి తుంగతుర్తి నుంచి రావులపల్లికి 8 కిలోమీటర్ల దూరం వెళ్లడానికి 20 నిమిషాల సమయం పట్టాల్సి ఉండగా రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులకు సుమారు గంట సమయం పడుతోంది. వర్షం వస్తే గుంతల్లో నీరు చేరి రోడ్డు సక్రమంగా కనిపించే పరిస్థితిలేదు. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. గత మూడేళ్లుగా తుంగతుర్తి–రావులపల్లి రహదారి గుంతలమయంగా ఉండి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా ఇటు పాలకులు గానీ, ఆర్‌అండ్‌బీ అధికారులు గానీ పట్టించుకోకపోవడం విచారకరం. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తుంగతుర్తి నుంచి రావులపల్లి వరకు రోడ్డు మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరైనా..

తుంగతుర్తి నుంచి మానాపురం వరకు 8కి.మీ మేర డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ.16.80 కోట్ల నిధులు, రావులపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి ఏనెకుంట తండా వరకు 6.3 కి.మీ బీటీ రెన్యువల్‌కు రూ.1.10కోట్ల నిధులు గత ఏడాది డిసెంబర్‌లో మంజూరయ్యాయి. కానీ ఏడాది గడుస్తున్నా నేటి వరకు ఈ పనులు ప్రారంభం కాలేదు. దీంతో రాకపోకలు సాగించడానికి ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



తుంగతుర్తి నుంచి వెంపటి మీదుగా రావులపల్లి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో గత మూడేళ్లుగా ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– మారెళ్లి వెంకన్న, వెంపటి

రేపటి నుంచి ప్రజాపాలన గ్రామ సభలు

ఆత్మకూర్ (ఎస్) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలులో భాగంగా గ్రామ సభల నిర్వహణకు చర్యలు చేపట్టింది. ఈ నెల 28 నుంచి జరిగే ఈ గ్రామసభల్లో 5 సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ గ్రామ సభలు నిర్వహించేందుకు తహసీల్దార్, ఎంపీడీఓలు రెండు టీమ్‌లుగా సమావేశాలు నిర్వహించనున్నారు. సమావేశంలో గృహలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులతో పాటు అర్హత పాత్రలను స్వీకరించనున్నారు. మండలంలో ఈ నెల 28న బోరింగ్ తండా, కొత్త తండా, దుబ్బతండా, ఖాశిగూడెంతండా, 29న మంగలి తండా, పీపనాయక్ తండా, రామోజీ తండా, ఏపూరు తండా, 30న ఆత్మకూరు, తుమ్మల పెన్‌పహాడ్, నెమ్మికల్, కందగట్ల, 2న పాత సూర్యాపేట, పాతర్లపహాడ్, ఏపూర్, కోటపహాడ్, 3న ముక్కుడు దేవులపల్లి, రామన్నగూడెం, గట్టికల్, ఏనుబాముల, 4న బొప్పారం, ఇస్తాళాపురం, మిడతనపల్లి, ముక్తకొత్తగూడెం, 5న బొట్య తండా, దాచారం, కోటినాయక్ తండా, 6న అస్ల తండా, శెట్టిగుడెం గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. ప్రజలంతా గ్రామ సభల్లో పాల్గొని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భానుపురి : పట్టణంలోని శభరినగర్ సాయిబాబా ఆలయంలో మంగళవారం దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్గశిర మాసం పౌర్ణమి రోజున త్రిమూర్తుల అంశంగా జన్మించినందున స్వామివారిని పూజిస్తే విష్ణు, ఈశ్వర, బ్రహ్మ ముగ్గురిని పూజించినట్లుగా అవుతోందని అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పూలు, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ సవరాల సత్యనారాయణ దంపతులు, కమిటీ సభ్యులు, పూజారులు విశ్వేశ్వర శర్మ, గంగాధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



భానుపురి : వేంకటేశ్వరస్వామి ఆలయంలో భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు



జాజిరెడ్డిగూడెంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

భానుపురి : పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస మహోత్సవాలు మంగళవారం పదవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారుజామునే స్వామివారి సన్నిధికి చేరుకొని తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు భక్తులందరికీ ప్రతిరోజూ భగవద్గీత నేర్పుతూ పారాయణం చేయిస్తున్నారు. కార్యక్రమంలో మహిళా భక్తులు, వికాస తరంగిణి, ఆండాళ్ గోష్ఠి భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

మంగళహారతులతో పూజలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళలు మంగళహారతులతో తరలివచ్చి పూజలు జరిపారు. కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాలధారులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరిలో మాట్లాడుతున్న సామేల్



వెంపటిలో ఎమ్మెల్యే మందుల సామేల్‌ను సన్మానిస్తున్న విక్రమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

తిరుమలగిరి : లయన్స్ క్లబ్ సభ్యులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. మంగళవారం తిరుమలగిరిలో లయన్స్ క్లబ్, ఎస్‌వీఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ సేవలకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని, ఈ సేవలను ఎల్లప్పుడూ కొనసాగించాలని కోరారు. అనంతరం వైద్యసిబ్బంది 250 మందికి ఉచితంగా గుండె పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ శారద, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న, ఎస్‌వీఆర్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ మదన్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మందడి పద్మారెడ్డి, కార్యదర్శి కందుకూరి లక్ష్మయ్య, కోశాధికారి సురేష్‌యాదవ్, నరోత్తమ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, డాక్టర్ నాగానంద్, విజయ్‌చందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకుడిని కలిసిన ఎమ్మెల్యే

తుంగతుర్తి : మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు దాయం విక్రమ్‌రెడ్డిని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మందుల సామేల్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ డీఈఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, దాయం ఝాన్సీ, సగ్గం నర్సయ్య, రేతినేని శ్రీనివాస్, తప్పెట్ల శంకర్, పులిగుజ్జ నర్సయ్య, మురుగుండ్ల వీరయ్య, కాంగ్రెస్‌పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

తన్నీరు వెంకటేశ్వర్లు మృతికి సంతాపం

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల గ్రామానికి చెందిన తన్నీరు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే మందుల సామేల్ మంగళవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, రేసు లింగయ్య, పాక అమృతమల్లు, మామునూరి ఉపేందర్, శ్యాం, సాయి, తన్నీరు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రామ పంచాయతీ భవనం

- 60ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలోనే ఇప్పటికీ కొనసాగుతున్న జాజిరెడ్డిగూడెం జీపీ కార్యాలయం
- భవనం పెచ్చులూడి పడుతుండటంతో భయాందోళనలో ప్రజలు, సిబ్బంది
- నూతన భవనం నిర్మించాలని వేడుకోలు



పూర్తిగా శిథిలమైన గ్రామ పంచాయతీ భవనం



భవనం లోపలి భాగం

అర్వపల్లి : మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ జాజిరెడ్డిగూడెం. ఈ గ్రామంలో దాదాపు 5వేల మంది జనాభా ఉంటుంది. అయితే ఇక్కడి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం జరిగి సుమారు 60 ఏళ్లు దాటింది. అప్పట్లో ఈ భవనాన్ని డంగు సున్నంతో నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం పూర్తిగా శిథిలమై ఏక్షణంలోనైనా కూలేదశకు చేరింది. అయిననూ తప్పని పరిస్థితుల్లో ఇందులోనే పంచాయతీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. భవనం పూర్తిగా శిథిలమైనందున దీనిని వాడుకోవద్దని ఇంజనీరింగ్ అధికారులు గతంలోనే తేల్చారు. కానీ ఇంతవరకు కొత్తభవన నిర్మాణం జరగక ఈ శిథిలమైన భవనంలోనే గ్రామ పంచాయతీని నడిపిస్తున్నారు.

భయం భయంగా..

శిథిలావస్థకు చేరిన భవనంలోనే గ్రామపంచాయతీ సభలు, సమావేశాలు జరుగుతున్నాయి. ప్రతిరోజు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఇందులోనే విధులు నిర్వహిస్తున్నారు. గ్రామపంచాయతీతో పాటు గ్రామపంచాయతీ వాటర్ ప్లాంట్‌ను కూడా ఇందులోనే కొనసాగిస్తున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది కూడా ఈ భవనంలోనే ఉంటూ భయం భయంగా గడుపుతున్నారు. ఈ గ్రామంతో పాటు పంచాయతీ పరిధిలోని తుంగగూడెం, కంచుగట్లగూడెం గ్రామాల ప్రజలు కూడా తమ పనుల కోసం ఈ కార్యాలయానికి వచ్చిపోతుంటారు. కానీ పంచాయతీ భవనం శిథిలమై పెచ్చులు ఊడి పడుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాజిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీకి నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు, జీపీ సిబ్బంది కోరుతున్నారు.

భవనంలోకి వెళ్లాలంటేనే భయమేస్తోంది



మా గ్రామంలోని గ్రామ పంచాయతీ భవనం పూర్తిగా శిథిలమై కూలే దశకు చేరింది. అందులోకి వెళ్లాలంటేనే భయమేస్తోంది. ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. భవనం పెచ్చులు ఊడి పడుతున్నాయి.

– బొల్లం సైదులు, గ్రామస్తుడు

కొత్త భవనం నిర్మించాలి



గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. ప్రభుత్వం కొత్త భవనం నిర్మించాలి. ప్రస్తుతం ఉన్న భవనాన్ని 60 ఏళ్ల కింద నిర్మించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే ఈ భవనాన్ని తొలగించి నూతనంగా నిర్మించాలి.

– కీర్తి వెంకటేశ్వర్లు, గ్రామస్తుడు

ఘనంగా సీపీఐ ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

తిరుమలగిరి : సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం తొండ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్లంల యాదగిరి సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూస్వాములు, దొరలు, జాగీర్దారులు, నిజాంలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేసిన గొప్ప పార్టీ సీపీఐ అని కొనియాడారు. పేద ప్రజలకు వేలాది ఎకరాల భూములు పంచిన పార్టీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీకాంత్, మల్లయ్య, అశోక్, సత్తయ్య, యాకన్న, చంద్రు, సోమనారాయణ, వెంకన్న, వీరయ్య, పలువురు సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెవిటి వెంకన్నకు ఎంపీ టికెట్ ఇవ్వాలి



మద్దిరాలలో మాట్లాడుతున్న ముక్కాల నాగరాజు

మద్దిరాల : కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ టికెట్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌కు ఇవ్వాలని మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు ముక్కాల నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పని చేసిన వ్యక్తి చెవిటి వెంకన్న అన్నారు. చెవిటి వెంకన్నయాదవ్‌కు భువనగిరి ఎంపీ టికెట్‌ను కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు గుండాల నాగరాజు, కోడి కుమార్ యాదవ్, కూజ ఎల్లేష్, మున్న నాగరాజు, కొండ నాగమురళి, కొండ మధు, అన్నెపర్తి విద్యాసాగర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదమే..

- పొలం దున్నేటప్పుడు జాగ్రత్త పాటించకుంటే కేజ్ వీల్స్ ట్రాక్టర్లు బోల్తా పడే ప్రమాదం
- డ్రైవర్లకు అవగాహన ముఖ్యమంటున్న వ్యవసాయ అధికారులు



గుంజలూరులో కేజ్ వీల్స్‌తో దున్నుతున్న రైతు

చివ్వెంల : యాసంగిలో సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు నాట్లు వేసేందుకు నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. ఒక్కోచోట కేజ్ వీల్స్‌తో దమ్ములు కొట్టిస్తున్నారు. దమ్ము చేసిన అనంతరం నాటు వేస్తారు. కేజ్ వీల్స్‌తో పంట పొలాల్లో ట్రాక్టర్లను నడిపే సమయంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. డ్రైవర్ తగు జాగ్రత్తలు పాటిస్తే ప్రమదాలు నివారించవచ్చు.

ప్రమాదాలకు కారణాలు..

పొలాల్లో నాటు వేసేముందు అంతా ఒకేలా ఉంటుంది. భూమి ఎక్కడ దిగబడుతుందో, ఎక్కడ దిగబడదో తెలియకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. పొలంలో నీళ్లు ఉండటంతో ఎక్కడ గుంతలు ఉంటాయో సరిగా తెలియదు. దీని కారణంగా కూడా ప్రమాదాలు జరుగవచ్చు. పొలంలో దమ్ము చేసే సమయంలో ట్రాక్టర్ చేతి ఎక్స్‌లేటర్ ఎక్కువగా వాడతారు. ఎక్స్‌లేటర్ ఎక్కువగా వాడుతూ.. ట్రాక్టర్ ఒక వైపు నుంచి మరొక వైపుకు మళ్లించేటప్పుడు బ్రేక్ ఉపయోగిస్తారు. వాహనాన్ని క్లచ్‌తో నియంత్రించవచ్చు. అనుభవం లేకపోతే బ్రేకులు వేసినా వాహనం ఆగడంలేదని పలువురు ఆందోళన చెందుతారు. కొన్ని సమయాల్లో కేజ్ వీల్స్‌కు పూర్తిగా మట్టి పడుతుంది. ఆ సమయంలో డ్రైవర్ ఎక్కువగా శక్తిని వినియోగిస్తాడు. అలాంటప్పుడు ట్రాక్టర్ బోల్తా పడే ప్రమాదం ఉంది. బ్రేకులు సరిగా పడకపోయినా, గట్లు ఎక్కేటప్పుడు ట్రాక్టర్ బోల్తా పడే ప్రమాదం ఉంటుంది. గట్లు ఎక్కేటప్పుడు ట్రాక్టర్‌ను అనుభవంతో నడపాలి. ఎక్స్‌లేటర్ ఎక్కువగా ఇస్తే బోల్తా పడే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

అనుభవం ఉన్నవారు మాత్రమే కేజ్ వీల్స్ బిగించిన ట్రాక్టర్ నడపాలి. కేజ్ వీల్స్ బిగించేటప్పుడు తప్పనిసరిగా వెనుక చక్రాలకు సమాన బరువులను ముందుబాగంలో బిగించాలి. బరువు ఎక్కువైతే డీజిల్ ఖర్చు ఎక్కువ అవుతుందని చాలామంది బరువులను వాడటం లేదు. ట్రాక్టర్ ఒకే స్పీడ్‌తో నడపాలి. పంట పొలాల్లో విద్యుత్‌స్తాంభాలు ఉన్న చోట, మూల మలుపుల వద్ద నెమ్మదిగా నడపాలి.

జాగ్రత్తలు పాటించాలి

పంట పొలాల్లో దమ్ము చేసే సమయంతో కేజ్ వీల్స్ ట్రాక్టర్లను జాగ్రత్తగా నడపాలి. అనుభవం ఉన్నవారు మాత్రమే వాహనం నడపాలి. అలాగే రోడ్లపై కేజ్ వీల్స్‌తో వెళ్లరాదు.

– ఎ.ఆశాకుమారి, మండల వ్యవసాయ అధికారి

అధికారుల నిర్లక్ష్యం.. తాగునీరు వృథా!



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

ఆత్మకూరు (ఎస్) : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మిషన్ భగీరథ నీళ్లు వృథాగా పోతున్నాయి. రోడ్డు విస్తరణ అనంతరం మంచినీటిని సరఫరా చేసేందుకుగాను అధికారులు ఈ ప్రాంతంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ వేశారు. అనంతరం ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చి ఇంటివరకు పైప్‌లైన్ వేయాల్సి ఉండగా మధ్యలోనే మురుగు కాలువలో వదిలేశారు. దీంతో మిషన్ భగీరథ నీరంతా మురుగు కాలువల్లో వృథాగా పోతుంది. నల్లా కనెక్షన్లు ఇళ్లలోకి ఇస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉండేది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇళ్లలోకి నీళ్లు రాకపోగా వృథాగా పోతున్నాయి.

స్నేహ నిలయంలో అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న రాంకుమార్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : అక్షర ఫౌండేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో స్నేహ అనాథ, వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్జీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాస రాంకుమార్‌రెడ్డి అన్నదానాన్ని ప్రారంభించారు. అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు ఉప్పు నాగయ్య–సంధ్యల 25వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్నేహ నిలయంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నరాల తిరుమలరెడ్డి, సెయింట్ జోసెఫ్, మేరీ, రోస్లీ, వీరాసింగ్, దండ శంకర్‌రెడ్డి, నజీర్ బాషా, సొల్లేటి ఉపేంద్రచారి పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్లపై రాయితీ

నూతనకల్ : నూతనకల్ మండల పరిధిలోని గ్రామాల్లో పెండింగ్ చలాన్లపై రాయితీ ఇస్తున్నట్లు ఎస్ఐ నరేష్ మంగళవారం తెలిపారు. ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90శాతం, టూవీలర్లపై 80శాతం, ఆటోలు, ఫోర్ వీలర్‌లపై 60 శాతం, భారీ వాహనాలపై 50శాతం రాయితీని ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

● పొగమంచు కప్పేసింది..



అర్వపల్లిలో మంగళవారం తెల్లవారుజామున హైవేపై కమ్ముకున్న మంచు



అర్వపల్లి గ్రామంలో ఉదయం వేళ ఇలా..